

ఉష్ణోగ్రత (అంచనా)

19-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	36	29
రెంటచింతల	42	28

కోలాహలంగా..

ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం

- విజేతలకు బహుమతులు అందజేసిన వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్
- ప్రథమ బహుమతిగా బైకు, ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా కలర్ టీవీ అందజేత
- 125 మందికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం.. విజేతల్లో ఆనందోత్సాహాలు







యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతి, బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి,దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిని అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానో త్సవం కోలాహల వాతావరణంలో జరిగింది. శుక్రవారం గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అంద జేశారు. గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో ముద్రితమైన కూపన్లను పాఠకులు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి ఆధ్వర్యంలో ఆయా కూపన్లలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయా విజేతలకు శుక్రవారం ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, పాఠకుల సమక్షంలో బహుమతులను అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతిగా బైకును అందజేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన ఎస్‌డీబీ బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి కింద ఫ్రిడ్జ్ అందచేశారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిగా కలర్ టీవీని అందజేశారు. మరో 125 మందికి ప్రోత్సాహక బహుమ తులుగా వివిధ రకాల గృహోపకరణాలను అందజేశారు.

ఆంధ్రజ్యోతి కార్యక్రమాలు గర్వకారణం : విద్యాసాగర్

నేటి సమాజంలో పఠనాసక్తి తగ్గుతున్న క్రమంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. లక్కీడ్రాలు నిర్వహిస్తూ పాఠకులకు బహుమతులు అందజేయడం విశేషమ న్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పత్రికా పఠనాన్ని ఆంధ్ర జ్యోతి ప్రోత్సహిస్తుందన్నారు. నేటి సమాజంలో పత్రికల ద్వారానే వాస్తవాలు తెలుస్తాయని తెలిపారు. సమాజానికి దిక్సూచిలా పత్రికలు పనిచేస్తున్నా యన్నారు. నేటి ఆధునిక సమాజంలో పత్రికలు ఆవశ్యకత ఎంతో ముఖ్యమైనదని (మిగతా 7వ పేజీలో)



పుడమికి.. పరీక్షలు

ఈ పరీక్షలు చేస్తారు..

నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా నేలల్లోని లోపాల ఆధారంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పోషకాలు వాడకం.. పంటల సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తారు.

అవగాహన లేమితో కొందరు.. అధిక దిగుబడుల కోసమని మరికొందరు ఇష్టం వచ్చినట్లుగా.. అవసరం లేకపోయినా రసాయన ఎరువులను వాడుతూ భూ సారాన్ని నిస్సారం చేసేస్తున్నారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న పుడమిని పరీక్షించి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అటు నేల తల్లిని రక్షించి.. ఇటు రైతులను ఆదుకునేలా ప్రభుత్వం భూ ఆరోగ్య పరీక్షలపై దృష్టి సారించింది. సకల పోషకాలకు నెలవుగా ఉండాల్సిన భూమి రసాయనాలతో నాశనమవగా భూ సారం నానాటికీ తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ పరిస్థితుల్లో నేలలో ఏఏ పోషకాలు లోపించాయో గుర్తించి వాటిని మాత్రమే వినియో గించేలా రైతులకు చెప్పి వారిని చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. సాయిల్ టెస్ట్‌లు చేసి మే 15వ తేదీ కల్లా హెల్త్ కార్డులను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యంగా నిర్దేశించింది. అయితే భూసార పరీక్షలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

- భూ ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- వచ్చే నెల 15 కల్లా హెల్త్ కార్డుల జారీ
- మూడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యం
- సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక



నరసరావుపేటలోని భూసార పరీక్షా కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పంటల సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో సూక్ష్మపోష కాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా పరీక్షల ఆధారంగా భూ సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటా యి. ఇంతటి కీలకమైన పుడమి ఆరోగ్య పరీక్షలకు వ్యవసాయ శాఖ సమాత్తమైంది. పంటలు సాగుకు ముందే మట్టి (మిగతా 7వ పేజీలో)



గుంటూరులో సందేశం ఇస్తున్న బిషప్ భాగ్యయ్య

భక్తిశ్రద్ధలతో.. శుభ శుక్రవారం

- చర్చిలు, సమాధుల తోటల్లో ప్రార్థనలు

బాపట్ల, ఏప్రిల్ 18: శుభ శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) వేడుకలు జిల్లావ్యాప్తంగా అ త్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని చర్చిలు, అన్ని ప్రాం తా ల్లోని సమాధుల తోటల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు శిలువ మరణం పొందిన గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నాటి క్రీస్తుశ్ర మలు, కష్టాలను గుర్తు తెచ్చుకుని కన్నీటి ప్రార్థనలు చేశా రు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి ప్రార్థనలు చేశారు. వారిని గుర్తు చేసుకుం టూ సమాధులపై పుష్పగుచ్ఛా లు ఉంచి క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. 40 రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన వారు ప్రార్థనల అనంతరం దీక్ష విర మించారు. అంత కముందు క్రైస్తవులు పలు ప్రాంతాల్లో శిలువయాత్ర నిర్వ హించారు.

శ్మశానవాటికకు దారి ఇవ్వండి

- అధికారులను ఆశ్రయించిన విజయనగర్ కాలనీ వాసులు



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మాణం జరుగుతున్న 167 ఏ జాతీయ రహదారిలో టన్నెల్ ఏర్పాటు చేసి ఉన్న శ్మశాన వాటికకు దారి కల్పించాలని స్థానిక విజయనగర్ కాలనీ వాసులు అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. సోమవారం చీరాల మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ వెంకట మురళి గ్రీవెన్సెలో జాతీయ రహదారి నిర్మాణ అధికారుల సమక్షంలో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


గస్తీకి.. సుస్తీ

- శిథిలావస్థలో స్పీడ్‌బోట్లు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత



సూర్యలంక : మెరైన్ పోలీసుస్టేషన్ వెనుక ఉంచిన స్పీడ్‌బోట్లు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సముద్రతీరం ద్వారా చొరబాటుదారులు రాకుండా భద్రతా చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 21చోట్ల మెరైన్ పోలీసుస్టేషన్‌లు (కోస్టల్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్) ఏర్పాటు చేశారు. ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో స్పీడ్‌బోట్లు ఏర్పాటు చేసి సముద్రజలాల్లో 12 నాటికల్ మైళ్ల వరకు గస్తీ నిర్వహించేవిధంగా చర్యలు చేపట్టారు. ఆయా స్టేషన్‌ల పరిధిలో మొత్తం 18 స్పీడ్‌బోట్‌లను ఇచ్చారు. వాటిల్లో ఒకటి కూడా ఇప్పుడు పనిచేసే పరిస్థితి కనిపించటంలేదు. సూర్యలంక సముద్రతీరంలో 2008వ సంవత్సరంలో మెరైన్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసి మూడు స్పీడ్‌బోట్లు కేటాయించారు. ఒక్కొక్క స్పీడ్‌బోటు ఖరీదు 70లక్షల రూపాయలు నుంచి కోటి రూపాయల వరకు ఉంటుంది. వీటి ద్వారా మెరైన్ సిబ్బంది సముద్రజలాలలో గస్తీ తిరుగుతూ కొత్త వ్యక్తులు, చొరబాటు దారులను గుర్తించి చర్యలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ బోట్లను నిజాంపట్నం జెట్టి దగ్గర ఉంచేవారు. ఒక్కొక్క బోటులో నలుగురు సిబ్బంది ఉండేవారు. 10 హెచ్‌పీ బోట్లు రెండు, 5హెచ్‌పి బోటు ఒకటి చొప్పున ఉండేది. ప్రస్తుతం మూడు పనిచేయకపోవటంతో తీసుకొచ్చి సూర్యలంకలోని మెరైన్ పోలీసుస్టేషన్ వెనుక పెట్టారు. ఇవి ఉప్పుగాలికి తుప్పు పట్టి పోతున్నాయి. ఇలాగే వీటిని వదిలేస్తే పనికిరాకుండా పోయేప్రమాదం ఉంది. 2017వ సంవత్సరం నుంచి వీటి పరిస్థితి ఇదేవిధంగా ఉంది. అప్పటి నుంచి ఉన్నతాధికారులు, పాలకులు వీటిపై దృష్టిపెట్టలేదు. తీరంలో గస్తీ ముమ్మరం చేస్తున్నాం. చొరబాటుదారులు రాకుండా చర్యలు చేపడుతామంటూ చెప్పేవారంతా వీటి విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఒక్కొక్కబోటుతో నెలరోజులు గస్తీ నిర్వహించేందుకు 2లక్షల రూపాయల ఆయిల్ ఖర్చు అవుతుంది. నలుగురు సిబ్బందికి వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. కేవలం ఆయిల్ ఖర్చు పెట్టలేక, సిబ్బంది నియామకం చేపట్టక పోవటం వల్లే వీటిని నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి.


సిబ్బంది కొరత

సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ళు 8 మంది కానిస్టేబుళ్ళు, ఆరుగురు హోం గార్డులు పనిచేస్తున్నారు. ఇంకా 17 మంది కానిస్టేబుళ్ళను భర్తీ చేయాల్సి ఉంది. స్పడ్‌బోట్లు నడిపేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రస్తుతం స్పీడ్‌బోట్లు పనిచేయకపోవటంతో ఆల్‌టెరైన్ వెహికల్స్ రెండు ఏర్పాటు చేయాలని మెరైన్‌సిబ్బంది ఇటీవల కలెక్టరేట్‌లో విజ్ఞప్తి చేశారు. వాటి ద్వారా బోర్డర్‌లో గస్తీ తిరగటానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కావున సంబంధితాధికారులు దీనిపై దృష్టిసారించి గస్తీకి తగిన ఏర్పాట్లు చేయటంతోపాటు అవసరమైన సిబ్బందిని భర్తీ చేయాలని తీరవాసులు కోరుతున్నారు.

కలుషిత నీటితో అవస్థలు

- పర్చూరు ప్రాంతంలో మరమ్మతులకు నోచని ఫిల్టర్ బెడ్‌లు

పర్చూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటిని సద్వినియోగ పరుచుకోలేదు. దీని కారణంగా నియోజకవర్గం వ్యాప్తంగా పిల్టర్ బెడ్‌లు పని చేయడం లేదు. దీంతో చెరువుల్లోని నీటిని శుద్ధిచేయకుండా ఓవర్



రంగుమారి ఫిల్టర్ బెడ్‌లలో సరఫరాకు సిద్ధంగా ఉన్న నీరు

హెడ్ ట్యాంకులకు ఎక్కించి నేరుగా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని చెరువుల్లో నీరు చిక్కపడి కలుషితంగా మారాయి. ప్రజలకు సరఫరా చేసిన నీరు రెండు రోజులకే పాచిపడుతోంది. పర్చూరులో ఉన్న నాలుగు ఫిల్టర్‌బెడ్‌లలో కనీసం ఇసుక కూడా మార్చలేదంటే వాటి వినియోగం ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పర్చూరు నియోజక వర్గంలోని అన్నీ గ్రామాల్లో ప్రజలకు శుద్ధి జలాలు అందించేందుకు జలజీవన్ నిధులు వినియోగించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించి మార్గ నిర్దేశం చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సంబంధించి 81 పనులకు గాను రూ.36.56 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. ఈనిధులతో ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులు, అవసరమైన చోట పైపులైన్ ఏర్పాటు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు, చెరువులకు నీటి సరఫరా జరిగేలా పైపులైన్ నిర్మాణాలకు సంబంధించి అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వెంటనే పనులు ప్రారంభించి శుద్ధ జలం ప్రజలకు అందేలా చర్యలు వేగవంతం చేశారు.



నీరు లేని ఫిల్టర్ బెడ్

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- 136 వాహనాలు సీజ్
- 14 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
- 268 వాహనాలకు జరిమానాలు



బాపట్ల చీలు రోడ్డు సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల , ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గురువాం రాత్రి జిల్లాలోని వివిధ ప్రదేశాలలో ఏకకాలంలో పోలీసు అధికారులు నాకాబందీ నిర్వహిం చారు. ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆయాస్టేషన్‌ల పోలీసు సిబ్బంది కలిసి 3,799 వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని కారణంగా 136 వాహనాలను సీజ్ చేశారు. 14మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 268 వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అక్రమ రవాణా, నేరాల నియంత్రణ లక్ష్యంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు సరైన ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చీరాల పట్టణంలోని గడియార స్తంభంసెంటర్, బస్టాండ్, పేరాలగేటు వద్ద, ఈపూరుపాలెంలో, బాపట్ల పట్టణంలోని చీలురోడ్డసెంటర్‌లలో నిర్వహించిన తనిఖీలలో ఎస్పీ స్వయంగా పాల్గొని వాహనాలను తనిఖీ చేసి అధికారులకు పలుసూచనలు చేశారు. అలాగే అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీలతో కలిసి జిల్లాలోని పలుచోట్ల వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు అడ్డుకట్టవేయటానికి అనుమానాస్పద వ్యక్తులు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవటానికి, ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించటానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు తనిఖీలు చేయటం జరిగిందన్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను, వాహనచట్టాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలన్నారు. కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. సరైన ధ్రువపత్రాలు కలిగియుండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 19 ఏప్రిల్ 2025

బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.



- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.

వంటిల్లు

మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.


దోసకాయతో వెరైటీగా..

దోసకాయ చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు


తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.



దోసకాయ వంకాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.



దోసకాయ...
పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.

జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పొడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

దోసకాయ చికెన్ కూర

కావాల్సిన పదార్థాలు

- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.



పర్సనల్ కేర్

చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.
- ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. ఆలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.



సెలెబ్ టాక్

ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!



పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

లిప్ టింట్: టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

మెగా డీఎస్సీలో 1,143 పోస్టులు

● ఉమ్మడి గుంటూరు జిల్లాకు కేటాయింపు

● సబ్జెక్టుల వారీగా జాబితా సిద్ధం చేసిన విద్యాశాఖ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాల వారీగా ఇప్పటికే పోస్టుల వివరాలను ప్రభుత్వం సేకరించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి 1143 పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నాయి. విద్యాశాఖ సేకరించిన వివరాల ప్రకారం ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 35, హిందీ 54, ఇంగ్లీషు 61, గణితం 32, ఫిజికల్ సైన్స్ 57, బయాలజికల్ సైన్స్ 82, సోషల్ స్టడీస్ 102, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166, ఎస్జీటీ 306 పోస్టులను భర్తీ చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 26, హిందీ 6, ఇంగ్లీషు 9, గణితం 4, ఫిజికల్ సైన్స్ 1, బయాలజికల్ సైన్స్ 5, సోషల్ స్టడీస్ 9, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, ఎస్జీజీ 185 పోస్టులు భర్తీ చేయనున్నారు.

24న డీఎస్సీపై అవగాహన సదస్సు

గుంటూరు (విద్య)ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న డీఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ డైరెక్టర్ రామన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం భర్తీ చేయబోతున్న 16,347 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ప్రిపరేషన్, పరీక్ష విధానంపై అభ్యర్థులకు ఉచిత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. బ్రాడీపేట 2 / 11 కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు వక్తగా పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు. వివరాలకు బ్రాడీపేట లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏడీఆర్‌ఎంగా రమేష్‌కుమార్... సైమన్ బదిలీ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ అదనపు మేనేజర్(ఏడీఆర్‌ఎం)గా ఎం.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఐఆర్‌ఎస్‌ఈ/ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏజీకి చెందిన ఆయన ఎన్‌హెచ్‌ఎస్ ఆర్‌సీఎల్‌లో డిప్యూటేషన్‌పై కొన సాగుతున్నారు. డిప్యూటేషన్ నుంచి వెనక్కు రప్పించిన రైల్వేబోర్డు గుంటూరు ఏడీఆర్‌ఎంగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఏడీఆర్‌ఎం కె.సైమన్ బదిలీ అయ్యారు. ఆయనకు నూతన పోస్టింగ్ త్వరలోనే ఇవ్వనున్నట్లు పేర్కొంది.



ప్రధాని మోదీ పర్యటనకు విస్తృతంగా జరుగుతున్న ఏర్పాట్లు





అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

● ప్రధాని మోదీ పర్యటనకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి పునర్నిర్మాణ పనులకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 2వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక భాగంలోని సభాస్థలి ప్రాంగణంలో పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భారీ టెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల కోసం ఒక టెంట్ ఆఫీసును సిద్ధం చేశారు. సభాస్థలిలో గ్యాలరీల భాగాన్ని భారీ ఎత్తున యంత్రాలు, రోడ్డు రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది రానుండటంతో భారీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రీన్‌బెల్టుల్లో భారీగా లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పూల మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇక సభాస్థలిని కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించనున్నారు.



రాజకీయ సన్యాసం చేసి..శరణు కోరు



● మాచర్లకు ఏం చేశావు పిన్నెల్లి
● వచ్చే ఏడాది వరికపూడిశెలను పూర్తి చేస్తాం
● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ధ్వజం

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసి, వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట తప్పారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా నెహ్రూ నగర్‌లోని వీవీఎస్ గార్డెన్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గానికి ఏం చేశావు పిన్నెల్లి అంటూ మాజీ ఎమ్మెల్యేను నిలదీశారు. 15 ఏళ్లుగా నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచి నాశనం చేసిన పిన్నెల్లి బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పి.. శరణు కోరాలని డిమాండ్ చేశారు. అలాగే జగన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను కూల్చి చేసిన పాపాలే నేడు ఏపీకి శాపాలుగా మారాయని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ అవినీతి పాలనలో అరాచకం, అవినీతి, దోపిడి, దౌర్జన్యాలు, దాడులపై శ్వేత పత్రాలను విడుదల చేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ ప్రజలు సుపరిపాలన చూస్తున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాచర్లను అభివృద్ధి చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.800 కోట్లకు పైగా నిధులు తాగునీటికి కేటాయించగా, రహదారులకు, మౌలిక వసతులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయానికి రూ. 25 కోట్లు, అమృత స్కీం కింద రూ.100 కోట్లు, సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద రోడ్లకు రూ.115 కోట్లు మాచర్లకు కూటమి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు

● రెండు నెలల్లో రోగులకు అందుబాట్లోకి తెస్తాం
● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో రెండు నెలల్లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు (టోటల్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అందుబాట్లోకి తెస్తున్నామని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రకటించారు. ప్రతి శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న 'మీ కోసం మేము' కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ ప్రకటన చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. అప్పట్లో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ కామినేని శ్రీనివాస్ కూడా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో ఈ ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల రోగుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లను తిరిగి ప్రవేశపెట్టేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ గతంలో తాము ఇంపోర్టెడ్ నీ ఇంప్లాంట్లు వాడామని, ఒక్కొక్క మోకీలు మార్పిడి సర్జరీకి రూ.1.70 లక్షలు ఖర్చు అయ్యిందని తెలిపారు. రెండు మోకీళ్ల మార్పిడికి రూ.3.40 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ల నిర్వహణ విషయమై ప్రభుత్వంతో మాట్లాడామని, మరో రెండు, మూడు నెలల్లో నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వారు ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

కోలాహలంగా.. ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం



విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రజ్యోతి డీజీ ఎం ఎస్. రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ ఎం సుబ్బారావు, టెక్నికల్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో బహుమతి గెలుస్తామని అనుకోలేదు. ప్రథమ బహుమతి కింద బైకును గెలుపొందినట్లుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దీంతో చాలా సంతోషం కలిగింది. ఆంధ్రజ్యోతి పాఠకులుగా ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నాం. ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ న్యూస్ ఛానల్ అంటే ఎంతో ఇష్టం. ఎండీ రాధాకృష్ణ, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-యడ్లపల్లి గౌరి (ప్రథమ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి వార్తలు నచ్చుతాయి



పదిహేను సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడ్ని. ప్రతి రోజు పేపర్ చదువుతా. ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు బాగా నచ్చుతాయి. ఎండీ రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

-(బిహారి సాహెబ్, ద్వితీయ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి పత్రిక అభిమానిని



కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌లో వచ్చే వార్తలు, చర్చలు, ఓపెన్ హార్ట్‌విత్ ఆర్కే వంటి కార్యక్రమాలు బాగా నచ్చుతాయి. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతాను. ఏబీఎన్‌లో వచ్చే న్యూస్ చూస్తుంటాము. తృతీయ బహుమతి కింద కలర్ టీవీ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- దొరడ్ల సుజాత(తృతీయ బహుమతి విజేత)

మొదలైన ఆహ్వాన నాటిక పోటీలు



విడాకులు కావాలి.. నాటికలోని సన్నివేశం

పెదనందిపాడు, ఏప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానిలో ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రోటరీ శాతబ్ధి గవర్నర్ జాష్టి ప్రమీలా రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజమని, అంతమాత్రాన కలిసి బతకలేమన్న తొందరపాటుతో విడాకులు కావాలనుకోవడం ఎంతవరకు సమంజసం ఈ నాటికి ప్రశ్నించింది. ద్వితీయ నాటికగా గుంటూరు వారి అమరావతి ఆర్ట్స్ చిగురు మేఘం, తృతీయ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మాస్వ రూపం ప్రదర్శించారు. తొలుత అక్షయ పాఠశాల విద్యార్థుల భరత నాట్యం ఆకట్టుకుంది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షులు, అధ్యక్ష కార్యదర్శులు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పరంకుశం శ్రీనివాసరావు, ఏఆర్ ప్రభాకర్, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, జనసేన నియోజిక కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు అమదాలపల్లి నరేంద్ర, బండారు రాంబాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాష్టి ప్రమీలా రంగారావు


తోట చంద్రయ్య హత్య కేసులో

స్పెషల్ పీపీగా హరిబాబు

● ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర హోంశాఖ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య కేసులో స్పెషల్ పీపీగా హైకోర్టు న్యాయవాది, టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు మాగులూరి హరిబాబును నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసును సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పలువురు నిందితులకు తాజాగా నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. తోట చంద్రయ్యను 2022 జనవరి 12న వైసీపీ గూండాలు ఆయన స్వగ్రామం గుండ్లపాడులోనే అత్యంత దారుణంగా హతమార్చారు. మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో తోట చంద్రయ్య గుండ్లపాడుతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలించారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీకి చెందిన ఎంపీపీ చింతా శివరామయ్య, ఆయన కుమారుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైసీపీ గుండాలు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తోట చంద్రయ్యను వెంటాడి, దారుణంగా హతమార్చారు. ఆయనపై దాడి చేసే సమయంలో జై జగన్, జై వైసీపీ అంటే ప్రాణాలతో వదిలేస్తామని హెచ్చరించారు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ చంద్రయ్య జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. దీంతో చంద్రయ్యను దారుణంగా నరికి చంపారు. కూటమి ప్రభుత్వం తోట చంద్రయ్య కేసును సీఐడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా టీడీపీ లీగల్ సెల్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబును నియమిస్తూ శుక్రవారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెదకూరపాడు మండలం హౌస్సింగ్ నగర్ గ్రామానికి చెందిన హరిబాబు గతంలో గుంటూరు జిల్లా కోర్టులోనూ పనిచేశారు.

బైక్ ఢీకొని మహిళ మృతి



షేక్ షంషాద్ బేగం మృతదేహం

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మైనర్ బైక్‌తో ఢీకొట్టడంతో మహిళ మృతిచెందిన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ ఆర్.రాంబాబు వివరాల మేరకు.. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన షేక్ షంషాద్ బేగం(56), చేబ్రోలు నుంచి బాపట్లకు బస్సులో వచ్చినట్లు టికెట్ ఉంది. బంధువు చనిపోతే చూడడానికి వచ్చిన షంషాద్ బేగంను జీబీసీ రోడ్డులోని వన్‌వే వద్ద ఓ మైనర్ బాలుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమె పడిపోయి తలకు గాయం కావడంతో స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. వీఆర్వో నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసి, అనంతరం వివరాలు సేకరించినట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన మైనర్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పుడమికి పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు పూర్తిచేసి నేల హెల్త్‌కార్డులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మే 15 కల్లా పరీక్షలు పూర్తి చేసి హెల్త్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. అయితే గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. బాపట్ల జిల్లాలో 17,201 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 10,800, పల్నాడు జిల్లాలో 17,700 భూసార పరీక్షలు నిర్వహించి రైతులు నేల ఆరోగ్య కార్డులను రైతులకు అందజేశారు. ఈ ఏడాది భూసార పరీక్షల లక్ష్యాలను పెంచారు. పల్నాడు జిల్లాలో 23,437, బాపట్ల జిల్లాలో 22,825, గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాల పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. నేల ఆరోగ్యం, పోషకం సామర్థ్యాన్ని బట్టి ఎరువుల వాడకం తెలుసుకోవచ్చంటున్నారు. పంటల దిగుబడి సరిగా లేకపోవడం.. సూక్ష్మ పోషకాల వంటి సమస్యలను పరీక్షల ద్వారా గుర్తించి వాటిని నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తారు.

గత ఏడాది లోపాలు ఇలా..

● గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో పల్నాడు జిల్లాలో నత్రజని, ఆర్గానిక్ కార్బన్ తక్కువగా ఉన్నట్లు తేలింది. పీహెచ్ తటస్థంగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో జింక్, ఐరన్, పాస్పరస్ మోతాదు తక్కువగా నిర్ధారించారు.

● బాపట్ల జిల్లాలో నత్రజని, పాస్పరస్, ఇనుము, జింక్ మాంగనీస్, కార్బన్ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. పీహెచ్ విలువ తటస్థంగా ఉంది.

● గుంటూరు జిల్లాలో జరిపిన నేల ఆరోగ్య పరీక్షల్లో నత్రజని, ఇనుము లోపాలు ప్రధానంగా నిర్ధారించారు.

పరీక్షలు సరే.. పోషకాల పంపిణీ?

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీని నిలిపేసింది. దీంతో రైతులు ఐదేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ఏడాది సూక్ష్మపోషకాలను పంపిణీ చేయలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు వ్యాపారులను ఆశ్రయించి దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యో తి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్ర వారం నాటికి 515.00 అడుగులు ఉంది. ఇది 140.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


భావదేవుని నూతన రథానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ముస్తాబైన భావదేవుని నూతన రథం

● పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి నూతన రథం నిర్మాణం పూర్తయ్యింది. మూడుస్టెప్‌లుగా తయారు చేసిన ఈ రథాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పరిశీలించి కొబ్బరికాయ కొట్టి మూడుస్టెప్‌లను ఏకం చేసే పనులను ప్రారంభించారు. దేవదాయ శాఖాధికారుల సమక్షంలో రథాన్ని బిగించి ప్రారంభానికి సిద్ధం చేశారు. మే 12వ తేదీన జరగనున్న భావదేవుని దివ్యరథోత్సవం నూతన రథంపై జరుగుతుందని ఎమ్మెల్యే వేగేశన తెలిపారు. కోటి 50 లక్షల రూపాయలు వెచ్చించి రథాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేశిరాజు వెంకటరమణబాబు, ఈవో డి.వెంకటేశ్వరరావు, ఓఎస్‌డి శ్రీరామచంద్రమూర్తి, కొటికం సుబ్బారావు గురుస్వామి తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలెండర్ లీక్ అయితే తగిన చర్యలు చేపట్టాలి

● ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలెండర్ లీక్ అయిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని నివారించాలని ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హెచ్‌పీ గ్యాస్ గోదాములో ఆఫీస్ సిబ్బందికి, వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం కోన ఫిల్లింగ్‌స్టేషన్‌లో పెట్రోల్ బంకులలో జరిగే అగ్నిప్రమాదాలు గురించి వివరించారు. ఫిల్లింగ్, రీఫిల్లింగ్ చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి అగ్నిప్రమాదం జరిగినప్పుడు నీరు, ఫోమ్‌కాంపౌండ్ ఉపయోగించి మంటలను ఆర్పే పద్దతి గురించి వివరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సమాధుల తోట శుభ్రం చేయించిన కూటమి నాయకులు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈస్టర్ వేడుకల నేపథ్యంలో పట్టణంలోని చెంగల్రాయుడుతోటలో 5 దళితవాడలకు సంబంధించిన శ్మశాన వాటికను కూటమి నాయకులు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో శుభ్రం చేయించారు. మృత్యుంజయుడై యేసుక్రీస్తు తిరిగి లేచిన సందర్భంగా ఈస్టర్ వేడుకలు జరుపుకుంటామని అందులో భాగంగా పూర్వీకుల సమాధులు శుభ్రం చేయించి రంగులు వేయటం జరుగుతుందని స్థానికులు వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మందపాటి ఆంద్రేయ, వంశీ, కూచిపూడి ఝాన్సీరాణి, జాషువా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.


చెంగల్రాయుడుతోటలోని సమాదుల తోటను ఈస్టర్‌వేడుకకు శుభ్రం చేయిస్తున్న చిత్రం

రామ్మోహన్ నాయుడు ఎంపిక తెలుగుజాతికే గర్వకారణం : కొల్లా

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచస్థాయి యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎకనామిక్ ఫోరం, 50 దేశాలు నుంచి వివిధ రంగాలకు చెందిన అత్యంత ప్రతిభావంతులుగా 116 మందిని ఎంపిక చేయగా రాజకీయరంగం నుంచి కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహననాయుడు ఎంపికకావటం తెలుగుజాతికే గర్వకారణమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. 26 సంవత్సరాల వయస్సులోనే రాజకీయ రంగ ప్రవేశం చేసి తన ప్రతిభాపాటవాలను రుజువు చేసుకున్న రాజకీయనాయకుడు రామ్మోహన్‌నాయుడు అని అన్నారు.

'తాండ్ర'కు అంజుమన్ కమిటీ అభినందనలు

కర్లపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని నల్లమోతువారిపాలేనికి చెందిన ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావును రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఎన్నుకోవటం అభినందనీయమని బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రహీంజానీ అన్నారు. తాండ్ర సాంబశివరావును అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలతో సైనిక సంక్షేమ సంఘ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సాంబశివరావును ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ అల్లావుద్దీన్, అబ్దుల్ గఫూర్, సయ్యద్‌బాషా, మస్తాన్ వలి, అబ్దుల్ మజీద్, అబ్దుల్ రజాక్, అబ్దుల్, సిరాజ్, నిస్సార్ అహ్మద్, బాజి, కరీముల్లా, ఇస్సాకు, అంజుమన్ కమిటీ సభ్యులు, హెల్పింగ్ హ్యాండ్స్ యువత, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను అవమానిస్తే సహించేదిలేదు : ఎంపీపీ

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజనలను అవమానించే విధంగా మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడటం సరికాదని ఎంపీపీ చినపోతుల హరిబాబు అన్నారు. వైసీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జరిగిన విషయాలను వక్రీకరిస్తూ గిరిజనులను అవమానిస్తే చూస్తు ఊరుకోమన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి హయాంలో జరిగిన అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. పేదల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల ఆగిపోతే దాని గురించి ఆలోచన చేయకుండా అన్ని వక్రీకరించి గిరిజనుల మధ్య గొడవలు సృష్టించాలని చూస్తే ఊరుకోమన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాలు అందజేత

కర్లపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ముస్లింలకు అబ్దుల్‌కలాం ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ అధ్యక్షులు పఠాన్ అహ్మద్‌బాషా అన్నారు. కర్లపాలెం పంచాయతీలోని ఎంపీ రాజుపాలేనికి చెందిన నిరుపేద మహిళకు శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చందోలు అయుబ్, షేక్ ఇబ్రహీం, రియాజ్‌బేగ్, గఫూర్ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జరుగుతుందని పిట్టలవానిపాలెం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత మండలశాఖాధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందిగా ఉన్న డివైడర్ కూల్చివేత


డివైడర్‌ను పగలగొట్టి శ్రీనివాస్‌నగర్ కాలనీలోకి వెళ్ళే విధంగా ఏర్పాటు చేస్తున్న చిత్రం

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో కర్లపాలెం రోడ్డులోని బైపాస్ దగ్గర నుంచి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల దగ్గర బైపాస్‌రోడ్డును లింక్ చేస్తూ కర్లపాలెం-చీరాల రోడ్డును హైవేరోడ్డుగా విస్తరించి అభివృద్ధి చేశారు. ఆ సమయంలో శ్రీనివాస్‌నగర్ కాలనీలోకి వెళ్ళేరోడ్డుతోపాటు విద్యానగర్‌లోకి వెళ్ళేరోడ్డులకు ఎదురుగా డివైడర్‌ను నిర్మించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీలోకి వెళ్ళాలంటే పబ్లిక్ స్కూల్ ఎదురుగా యూటర్న్ తీసుకొని రావాలి. అదేవిధంగా విద్యానగర్‌లోకి వెళ్ళాలంటే వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల దగ్గర యుటర్న్ తీసుకొని రావాలి. దీంతో రెండు కాలనీల ప్రజలు వైసీపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి, వ్యతిరేకత కనబర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రత్యేక చొరవ తీసుకొని శ్రీనివాస్‌నగర్ కాలనీకి వెళ్ళే రోడ్డు ఎదురుగా డివైడర్‌ను పగలగొట్టి అక్కడ రోడ్డును కలిపారు. పురపాలక సంఘం నుంచి సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. అదేవిధంగా విద్యానగర్ వద్ద కూడా చేయాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రోడ్డెక్కిన దుకాణాలు

● ఖాళీ అవుతున్న రైతుబజారు
● పట్టించుకోని అధికారులు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై ప్రారంభానికి నోచుకొని బాపట్ల రైతుబజారును అధికారులు, కూటమి నాయకులు ప్రారంభించి రైతులకు, చిరువ్యాపారులకు అంకితం చేశారు. దీంతో రోడ్లపై ఉన్న దుకాణాలు రైతుబజారులోకి వెళ్ళాయి. దీనివల్ల కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ సమస్య లేకుండా అన్ని రకాల ఉపయోగంగా ఉండేది. కొద్దిరోజులుగా రైతుబజారులో ఉండాల్సిన దుకాణాలు కాస్త తిరిగి మరలా రోడ్డుపైకి వచ్చాయి. సన్న, చిన్నకారు రైతులు పండించిన ఉత్పత్తులను తక్కువ ధరకు కొని కొందరు వ్యాపారులు రోడ్లపైన దుకాణాలు పెట్టి వ్యాపారం చేస్తూ అన్నిరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నారు.


రైతుబజారు వదిలేసి రోడ్డుపై కూరగాయలు పెట్టి విక్రయిస్తున్న వ్యాపారులు

రైతుబజారులో తక్కువ ధరకు వచ్చే కూరగాయలు దీనివల్ల రోడ్లపై ఎక్కువ ధరకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా కొనుగోలుదారుల రాకపోకలకు, ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం ఏర్పడుతున్నది. మున్సిపల్ అధికారులు మొదట్లో వీటిని అరికట్టి అటు మార్కెట్‌లో, ఇటు రైతుబజారులో వ్యాపారం జరిగే విధంగా చూసేవారు. ప్రస్తుతం వారు పట్టించుకోకపోవటంతో మార్కెట్‌కాస్త గత పరిస్థితికొచ్చింది. రోడ్లపైకి దుకాణాలు వచ్చాయి. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


బాపట్ల సీబీజెడ్ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలు గురించి వివరిస్తున్న సంఘనాయకులు, కార్యక్రమానికి హాజరైన సంఘసభ్యులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలు

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు, బాపట్ల పట్టణంలోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నాలుగు రోజులుగా ఉపవాసదీక్షలో ఉండే క్రైస్తవులంతా సిలువధ్యానం తర్వాత ఉపవాసం విరమించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యెరుషలేం పట్టణంలోని కల్వరిసిలువపై యేసుక్రీస్తు పలికిన 7 మాటల విశిష్టతను గురించి సంఘకాపరులు, సంఘస్తులు వివరించారు. సిలువధ్యానం ప్రార్ధనలు చేశారు. బాపట్ల పట్టణంలోని ప్రసద్ధిగాంచిన సీబీజెడ్ చర్చిలో పాస్టర్ పవిత్రకుమార్, రెవరెండ్ రాహుల్‌దేవ్, చర్చి సెక్రటరి క్రిష్టాఫర్, జె.ఎస్.హెర్బర్ట్ తదితరులు సిలువధ్యానం చేశారు. అదే విధంగా 32వ వార్డు హయ్యర్ నగర్‌లో పాదర్ హయ్యర్ మెమోరియల్ లూధరన్ దేవాలయంలో రెవరెండ్ డాక్టర్ సీహెచ్ యేసురత్నం గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలు చేయించారు. అదేవిధంగా సాల్వేషన్ ఆర్మీ మెయిన్ చర్చి, విద్యానగర్‌లోని చర్చిలలో ప్రార్ధనలు నిర్వహించారు. విజయలక్ష్మీపురంలోని క్రైస్ట్ సెంట్రల్ చర్చిలో కూడా గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలు జరిపారు. ఈవిధంగా అన్నిసంఘాల పరిధిలో గుడ్‌ఫ్రైడే ప్రార్ధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సండేస్కూల్ డైరెక్టర్ అడే సుష్మా, పీసీసీ మెంబర్లు పేరికల రూత్‌జైశీల్‌బాబు, జోగి ఆదినారాయణ, ఎం.వెంకటస్వామి, సలగల రమేష్‌బాబు, బిళ్ళా పెద్దా అడే వంశీ, దోనేపూడి వరకుమార్, మేకల యాకోబు, పేర్లి సత్యదేవకుమార్, సలగల భావన్న, హయ్యర్‌నగర్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పేరలిలో యేసుక్రీస్తు శిలువ దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం.

కర్లపాలెం మండలంలో ..

కర్లపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 20 పంచాయతీ పరిధిలోని హరిజనవాడలలో, కర్లపాలెం, పేరలి, గణపవరం, యాజలి, చింతాయపాలెం గ్రామాలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేరలి గ్రామంలో యేసుక్రీస్తు శిలువదారణ చేయగా భటులు యేసుక్రీస్తును శిక్షిస్తూ వీధులలో ప్రదర్శన చేశారు. గ్రామంలోని సిలువ ఘట్టాన్ని గ్రామంలోని ప్రజలందరు ఆసక్తిగా తిలకించారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విశ్వశాంతి కోసం ప్రేమను నింపిన సమాజస్థాపన కోసం యేసుక్రీస్తు సిలువ మోసి తన రక్తాన్ని చిందించిన రోజును క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారని ఆయా చర్చిల పాస్టర్‌లు తెలిపారు. మండలంలోని 14 గ్రామపంచాయతీలలోని వివిధ చర్చిలలో క్రైస్తవులు శుక్రవారం ఉదయం గ్రామాలలోని తమ పూర్వీకుల సమాధులను శుభ్రం చేసి ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహించుకున్నారు. మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం, చందోలు, భవనంవారిపాలెం, కోమలి, సంగుపాలెం కోడూరు, మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం తదితర గ్రామాలలోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైసవులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించుకున్నారు. యేసు ప్రభు వు త్యాగనిరతిని కొనియాడారు.

వేమూరు మండలంలో...

వేమూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గ్రామాల్లోని శ్మశాన వాటికలో మృతి చెందిన కుటుంబాల సభ్యుల సమాధుల వద్ద ప్రార్ధనలు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం పాస్టర్లు గుడ్ ఫ్రైడే విశిష్టతను తమ ప్రసంగాల ద్వారా వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు జనన విశేషాలను తెలుసుకుని ప్రార్ధన రూపంలో ఆయనను ధ్యానించాలని అప్పుడు ప్రతి ఒక్కరిని క్రీస్తు సంపూర్ణంగా ఆశీర్వదిస్తారని అన్నారు. గ్రామాలలో సిలువను భుజంపై పెట్టుకుని క్రీస్తు కీర్తనలు ఆలపిస్తూ వీధులలో ఊరేగింపు జరిపారు. పేదలకు దానధర్మాలు చేశారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

కొల్లూరు, భట్టిప్రోలు మండలాలో...

కొల్లూరు, భట్టిప్రోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. శుక్రవారం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న ప్రార్ధనాలయాల్లో పాస్టర్లు మాట్లాడుతూ, ఏసుక్రీస్తు సిలువ మీద పలికిన ఏడు మాటలను వివరించారు. దేవుని యందు విశ్వాసంతో 40 రోజులు ఉపవాసాలు ఆచరించి గుడ్ ఫ్రైడేను జరుపుకుంటున్నామని క్రైస్తవులు తెలిపారు. నిత్యం ప్రభువు మీద అదే విశ్వాసాన్ని కొనసాగించాలని కోరారు. ప్రభువు రక్తంచే కడుగబడిన ప్రపంచ ప్రక్షాళన రోజు గుడ్ ఫ్రైడే అన్నారు. ఆయన రక్తం ద్వారా విజయోత్సవ సందేశం తెలియజేయడం జరిగిందన్నారు. పాస్టర్లు, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణంపై విజిలెన్స్ అధికారుల దాడి

రేపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సరైన అనుమతులు లేకుండా పురుగు మందులు విక్రయాలు జరుపుతున్న దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. గుంటూరు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలసి రేపల్లె మండలం బొబ్బర్లంక గ్రామంలో అనధికారికంగా పురుగు మందులు విక్రయాలు జరుపుతున్న కాటూరు రామకృష్ణపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో 218.317 లీటర్లు 4 లక్షల 55 వేల 780 రూపాయలు విలువ గల పురుగుమందులు, 48.7 లీటర్లు బయోస్టిమ్‌లెంట్స్ రూ.లక్ష 23 వేల 513 విలువ గల మందులను సీజ్ చేసి రామకృష్ణపై మున్సిఫ్ మెజిస్ట్రేట్, బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసులు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ, డీసీటీవో రామారావు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు మాజీ ఎమ్మెల్యే కోన ఆర్థికసాయం


అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కోన రఘుపతి

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాలలో సర్వస్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. మూలపాలెం గ్రామానికి చెందిన రేగులగడ్డ వినయ్‌కుమార్‌కు చెందిన వరికుప్పపై పిడుగుపడి పూర్తిగా బుగ్గిపాలు కావటంతో ఆ కుటుంబాన్ని కోన రఘుపతి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా మురుకొండపాడు గ్రామంలో బెజ్జం శాంతిబాబుకు సంబంధించిన ఇల్లు దగ్ధం కాగా ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థికచేయూతనందించారు. అండగా ఉంటానని హామీనిచ్చారు. ఆయా కార్యక్రమాలలో పట్టణ, మండల వైసీపీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఏడుకొండలురెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య పాల్గొన్నారు.

సూర్యలంక రోడ్డులో పోలీసుల స్పెషల్ డ్రైవ్

బాపట్లరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి సూర్యలంక రహదారిలో రూరల్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు తనిఖీ నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులను అదుపులోకి తీసుకొని పలుచర్యలు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎం.శాంతికుమారి తెలిపారు. భట్టిప్రోలు, పెదపులివర్రు సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆనందబాబు పరామర్శ

భట్టిప్రోలు, (కొల్లూరు) ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాప్తిస్మం తీసుకునేందుకు వెళ్లి మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని వేమవరం గ్రామానికి చెందిన 30 మంది గురువారం రేపల్లె మండలం పెనుమూడిలోని కృష్ణానది వద్ద బాప్తిస్మం స్వీకరించి నదిలో స్నానమాచరించేందుకు వెళ్లి కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు వారిలో ముగ్గురిని రక్షించగా పి.దేవదాసు, పి.గౌతమ్‌లు గల్లంతై మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం వేమవరం చేరుకుని యువకుల పార్థివదేహాలను సందర్శించి నివాళులర్పించారు. యువకుల కుటుంబాలను ఎమ్మెల్యే కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

రేపల్లె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో ఉన్న బీజేపీ మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా ముస్లింలపై విద్వేషాన్ని జిమ్మే వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. లౌకిక విలువలను, మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణలకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన కార్యక్రమంలో కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలకు ధార్మిక సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణ్‌రావు, ఆశీర్వాదం, కె.రమేష్, ముస్లిం పెద్దలు మజీద్, ఆరీఫుల్లాఖాన్, సిరాజ్, ఆయూఖాన్ పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్‌సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కర్లపాలెంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. జుమ్మా నమాజ్ అనంతరం ముస్లింలు ఇస్లాంపేట మర్కస్ మసీదు నుంచి కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయం వరకు బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు.

మృతుని కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

చెరుకుపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఈనెల 16వ తేదీన మృతి చెందిన గుళ్ళపల్లికి చెందిన బట్టు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, శివప్రసాద్ సహకారంతో ఇన్సూరెన్స్ కంపెనీ వారు శుక్రవారం 75 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన

వేమూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వేమూరు శాసన సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం షెడ్యూల్‌ను ప్రభుత్వ అధికారులు ప్రకటించారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని రోశయ్య మీటింగ్ హాలులో ఏడవ పౌష్టికాహార పక్షోత్సవ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగిస్తారు. 5.30 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 6 గంటలకు జంపని, పోతుమర్రు రోడ్డు విద్యుదీకరణ పనులను ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

ఘనంగా మధుసూదనప్రసాద్ జన్మదిన వేడుకలు

కొల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి మధుసూదన ప్రసాద్‌కు తినిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడంతో పాటు పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మండలంలో కనగాల అభిమానులు పలు చోట్ల జన్మదిన వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేశారు. రాత్రివేళ కాకతీయ కల్యాణ మండపంలో అభిమానుల సమక్షంలో కనగాల భారీ కేక్‌ను కట్ చేశారు. తొలుత పార్టీ నాయకులు, అభిమానులు డాక్టర్ కనగాలకు పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలవర్తి కోటేశ్వరరావు, కోగంటి శివవెంకటేశ్వరరావు, శిగిలిశెట్టి రాఘవరావు, గుత్తికొండ లక్ష్మీజ్ఞానానంద భగవాన్, కె.తాతాజీ, కొల్లి శివరామకృష్ణ ప్రసాద్, బేతపూడి నాగమనోహర్, తూము నవీన్, మున్నంగి హనుమంతరావు, మన్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మధుసూదన ప్రసాద్‌కు జన్మదిన కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రేపు సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ముఖ్యమంత్రి 75వ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీపీఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : అకస్మాత్తుగా గుండె జబ్బులతో నిత్యం ప్రాణాలను కోల్పోతున్నారని, కొంతవరకైనా కాపాడేందుకు సీపీఆర్ శిక్షణ ఉపయోగపడుతుందని ఎంసీఏ కార్యదర్శి పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో ఎంసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిలటరీలో లెఫ్టినెంట్ కన్నల్‌గా మిలటరీలో విధులు నిర్వహించి గుండెజబ్బుల నివారణ కోసం ఎన్నో గుణాత్మక మార్పులు తీసుకువచ్చి వేలాది మంది ప్రాణాలను కాపాడారని అన్నారు. డాక్టర్ వై.అశోక్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు ఎంసీఏ హాలులో సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలివిడత పదిమంది చొప్పున ఆటోడ్రైవర్లు, ఆర్టీసీ బస్సు కార్మికులు, పోలీసులు, మీడియా ప్రతినిధులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంతో అనుభవం ఉన్న లెఫ్టినెంట్ కన్నల్ డాక్టర్ వై.అశోక్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జీ.బాపారావు, డాక్టర్ వి.రామకృష్ణ, నల్లూరు రమేష్‌బాబు, నంబూరు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి తోడ్పడాలి

● ఉర్దూలో రాణించిన పదిమంది విద్యార్థులకు చేయూత


ఉర్దూలో 99 మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రేపల్లె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్‌లో అహ్మద్‌దీయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఉర్దూలో వందకు 99 మార్కులు పది మంది సాధించారని కళాశాల సెక్రటరీ సయ్యద్ తాహీర్ అన్నారు. సెకండ్ లాంగ్వేజీలో ఉర్దూని తీసుకుని ప్రతిభకనబర్చిన పది మంది విద్యార్థులను అభినందించి ప్రోత్సాహక బహుమతులను అందించామని తెలిపారు. విద్యార్థులు రూమాన్, కౌసర్, మస్తానీ, తర్నీషా, సాదీయా, ఆశ, రెహానా, కమల్, అయేషా, నూర్జిమా, సాధియా, రేష్మాసాహియాసుల్తానా, ఫరిదా, సమీనా 99 మార్కులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శాకాహార ర్యాలీ

చెరుకుపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలోని శ్రీరాధాకృష్ణ పిరమిడ్ ధ్యానశక్తి కేంద్రం మూడవ వార్షికోత్సవం సం దర్భంగా ఈనెల 20న బాపట్ల జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్, పిరమిడ్ సేవాదళ్ వారి ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ ఆర్య వైశ్య కల్యాణ మండపం వద్ద నుంచి పొన్నపల్లిలోని శ్రీరామకృష్ణ తపోవనం వరకు జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు గొల్లపూడి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతేసదానంద గిరి స్వామిమహారాజ్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కద్దాల్ పిరమిడ్ కొరప్రోలు విజయ భాస్కరరెడ్డి, పిరమిడ్ సేవాదళ్ గుంటూరు అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చెరుకుపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నపల్లి ఎస్టీ కాలనీ సమీపంలోని మురుగుకాల్వ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో రవికుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.అనిల్‌కుమార్ శుక్రవారం కేసు నమోదు చేశారు. వృద్ధునికి సుమారు 65 నుంచి 70 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై వంకాయ రంగు పొడవు చేతుల చొక్కా, ముదురుపచ్చరంగు లుంగీ ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిపిన వారు 94409 00894 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని రేపల్లె ఏరియా వైద్యశాల శవగారంలో భద్రపరిచినట్లు తెలిపారు.

అవీ.. ఇవీ


కుట్టు మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

మహిళలు ఆర్థికంగా బలపడాలి

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యాపారంతో ఆర్థికంగా బలపడి, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళల ఉపాధి కల్పనకు విశేషంగా కృషిచేస్తున్నదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం వేటపాలెం మండల కార్యాలయం, తోట వారి పాలెం సచివాలయం 2లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. అలాగే వ్యక్తిగత నైపుణ్యాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం చీరాలనగర్ వీర్ల అంకమ్మతల్లి సంబరాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంకొల్లులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముస్లింల శాంతి ర్యాలీ

● వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్

ఇంకొల్లు,ఏప్రిల్ 18,(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడం ముస్లింల మత స్వేచ్ఛపై దాడి చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకొల్లులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం భారీశాంతి ర్యాలీ నిర్వహించారు.అధికసంఖ్యలో ముస్లింలు పాల్గొని నినాదాలు చేశారు. కేంద్రప్రభుత్వ విధానాలపై వారు మండిపడ్డారు. వక్ఫ్ చట్ట సవరణ ముస్లింల హక్కులను హరించే విధంగా ఉన్నదన్నారు. ముస్లిం ఆస్తులు ఆదాని, అంబానీలకు కట్టబెట్టడానికే ఈ వక్ఫ్ సవరణ చేశారని వారు ఆరోపించారు.వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకొల్లులో స్థూపం నుంచి జరిగిన ఈ శాంతియుత ర్యాలీలో స్థానిక ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


పూజారులతో చర్చిస్తున్న ఈవో తిమ్మానాయుడు

అందరి సహకారంతో మహాకుంభాభిషేకం

అద్దంకి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపం పునఃనిర్మాణం సందర్భంగా మే 19 వ తేదీ జరిగే మహాకుంభాభిషేకం విజయవంతం అయ్యేందుకు అందరి సహకారం తీసుకుంటామని ఈవో ,అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు అన్నారు. ఏర్పాట్లు, పూజా కార్యక్రమాల నిర్వహణపై పూజారులతోఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పూజా కార్య క్రమాలు, హోమాలు ఏయే ప్రాంతాలలో నిర్వహించాలో చర్చించారు. శృంగేరి పీఠాధిపతి, శిష్య బృందం విడిది ఏర్పాట్లపై చర్చించారు. వేదపండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, మిగిలిన పూజారులు పాల్గొన్నారు.

వేగంగా అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు

రాజుపాలెం,జొన్నతాళి క్రాస్ రోడ్డుల వద్ద ప్రారంభం

ఏడాదిలోగా పనుల పూర్తికి ప్రణాళికలు

మార్టూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నుంచి ఒంగోలు వెళ్లే 216వ నంబరు జాతీయరహదారిపై బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలో రెండు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారు మంజూరుచేసిన 67 కోట్ల వ్యయంతో రాజుపాలెం క్రాస్ రోడ్డు,జొన్నతాళి క్రాస్ రోడ్డుల వద్ద అండరుపాస్ పనులు చేపట్టారు. రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద పెద్ద అండర్‌పాస్ (వీయూపి),జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండర్‌పాస్ (ఎల్వీయూపీ) ఏర్పాటు చేస్తున్నారు. 20 రోజుల నుంచి సంబంధిత కాంట్రాక్టరు అండర్‌పాస్‌ల నిర్మాణ పనులను ప్రారంభించారు.అందుకు సంబంధించి రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద జాతీయరహదా




రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద అండర్ పాస్ నిర్మాణం కోసం తూర్పువైపున ఏర్పాటుచేసిన సర్వీసు రోడ్డు (ఇన్‌సెట్లో) మైనింగ్ బ్రిడ్జి ఏర్పాటు పనుల్లో సిబ్బంది

రిపై వెళ్లే వాహనదారులకు,స్థానికంగా వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేలా జాతీయరహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. దాదాపుగా రాజుపాలెం క్రాస్ రోడ్డునుంచి చిలకలూరిపేట వైపు యలవర్తి కోల్డ్‌స్టోరేజీ సమీపం వరకు తూర్పువైపున సర్వీసు రోడ్డు పనులను చేపట్టారు. అంతేగాకుండా క్రాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న రెస్ట్ ఏరియా ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న రెండు బ్రిడ్జీలకు సమాంతరంగా మరో రెండు ఎంఎస్‌డీ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రయత్నాలు మొదలెట్టారు. రాజుపాలెం క్రాస్ రోడ్డు కు యద్దనపూడి మండలం వైపునుంచి,మార్టూరు టౌన్ నుంచి, బల్లికురం మండలం నుంచి రాజుపాలెం గ్రామం మీదుగా వాహనాలు వస్తున్నందున అందుకు తగినట్లుగా భవిష్యత్తులో వాహనదారులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటుచేస్తున్నారు. ఇంకా జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద మినీ అండరుపాస్ ఏర్పాటుకు జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్డు ఏర్పాటుకు హైవే రోడ్డుపై ఇరువైపులా కొంతమేర ఇనుపగ్రిల్స్‌ను తొలగించారు.అందుకు సంబంధించి పనులను చేపడుతున్నారు.

విద్యుదాఘాతంతో ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ మృతి

● స్తంభం ఎక్కుతూ జారి పడి మృతి చెందాడంటున్న అధికారులు

అద్దంకి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ పులి నెహేమియా(42) మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబం కథనం మేరకు మండలంలోని చినకొత్తపల్లికి చెందిన పులి నెహేమియా గత 15 సంవత్సరాలు గా ప్రయివేట్ ఎలక్ట్రీషియన్‌గా పంచాయతీ వీధి దీపాలు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో జొన్నలగడ్డ రామాంజనేయులుకు చెందిన రైస్‌మిల్‌కు విద్యుత్ సరఫరా రావటం లేదని చెప్పటంతో వెళ్లాడు. విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ఎల్‌సీ తీసుకొని రైస్ మిల్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కింద పడి పోయాడు. దీంతో స్థానికులు వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు.


మృతి చెందిన పులి నెహేమియా

నెహేమియాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే నెహేమియా విద్యుత్‌స్తంభం ఎక్కుతూ పడిపోయి మృతి చెందాడని విద్యుత్ డీఈఈ దామోదరం ప్రకటించారు. విద్యుత్ లైన్ మరమ్మతులకు ప్రయివేట్ లైన్‌మెన్‌కు ఎల్‌సీ ఇవ్వటం పట్ల విమర్శలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తరువాత తమకు సంబంధం లేదని తప్పించుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

మలుపులో విద్యుత్ స్తంభాలు

● వాహనదారుల అవస్థలు

బల్లికురవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల క్రితం బల్లికురవ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఇప్పుడు రోడ్డుపై ఉండటంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో మలుపులలో ఉన్న విద్యుత్ స్తంభాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. మార్టురు వైపు నుంచి అద్దంకి వైపు వచ్చే మలుపులో రోడ్డుపైకి ఉన్న విద్యుత్ స్తంభాలను అనుకొని పెద్ద పెద్ద వాహనాలు మలుపులో వస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు వాహనాలు వెళ్లే వరకు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ఉంటున్నారు. విద్యుత్ లైన్ రోడ్డుకు దూరంగా వేసేందుకు అధికారులు రెండు మాసాల క్రితం ఎత్తుగా ఉన్న స్తంభాలను ఏర్పాటు చేసినా పనులు మాత్రం ఇంత వరకు చేపట్ట లేదని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోక పోవటం వలనే సమస్య నెలల తరబడి అలానే ఉందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్‌ను, స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో సీసీ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

పుడమికి పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు పూర్తి చేసి నేల హెల్త్ కార్డులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మే 15 కల్లా పరీక్షలు పూర్తి చేసి హెల్త్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. అయితే గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. బాపట్ల జిల్లాలో 17,201 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 10,800, పల్నాడు జిల్లాలో 17,700 భూసార పరీక్షలు నిర్వహించి రైతులు నేల ఆరోగ్య కార్డులను రైతులకు అందజేశారు. ఈ ఏడాది భూసార పరీక్షల లక్ష్యాలను పెంచారు. పల్నాడు జిల్లాలో 23,437, బాపట్ల జిల్లాలో 22,825, గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాల పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

గత ఏడాది లోపాలు ఇలా..

- గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో బాపట్ల జిల్లాలో నత్రజని, పాస్పరస్, ఇనుము, జింక్ మాంగనీస్, కార్బన్ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. పీహెచ్ విలువ తటస్థంగా ఉంది.

పరీక్షలు సరే.. పోషకాల పంపిణీ?

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం.

గతంలో టీడీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీని నిలిపేసింది. దీంతో రైతులు ఐదేళ్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

కోలాహలంగా.. ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్.రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ ఎం సుబ్బారావు, టెక్నికల్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది

ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో బహుమతి గెలుస్తామని అనుకోలేదు. ప్రథమ బహుమతి కింద బైకును గెలుపొందినట్లుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దీంతో చాలా సంతోషం కలిగింది. ఆంధ్రజ్యోతి పాఠకులుగా ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నాం. ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ న్యూస్ ఛానల్ అంటే ఎంతో ఇష్టం. ఎండీ రాధాకృష్ణ, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-యడ్లపల్లి గౌరి(ప్రథమ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి వార్తలు నచ్చుతాయి

పదిహేను సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడ్ని. ప్రతిరోజు క్రమం తప్పకుండా పేపర్ చదువుతా. ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు బాగా నచ్చుతాయి. ఎండీ రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

-(బిహారి సాహెబ్, ద్వితీయ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి పత్రిక అభిమానిని

కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌లో వచ్చే వార్తలు, చర్చలు, ఓపెన్ హార్ట్‌విత్ ఆర్కే వంటి కార్యక్రమాలు బాగా నచ్చుతాయి. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతాను. ఏబీఎన్‌లో వచ్చే న్యూస్ చూస్తుంటాము. తృతీయ బహుమతి కింద కలర్ టీవీ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- దొరడ్ల సుజాత(తృతీయ బహుమతి విజేత)

వృత్తి విద్య కోర్సులను సద్వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఉచిత వృత్తి విద్య కోర్సులను విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని హెచ్‌ఎం పి. గంగాధరరావు అన్నారు. తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ (వృత్తి విద్య) ఒకేషనల్ ఇంటర్నషిప్ కోర్సులలో భాగంగా పదో తరగతి పూర్తి చేసిన 29 మంది విద్యార్థులు శిక్షణ పొందుతుండగా శుక్రవారం ఆయన వారితో మాట్లాడారు. శిక్షణ శనివారంతో పూర్తవుతుందని, అనంతరం విద్యార్థులకు ఎస్‌ఎస్‌ఏ ద్వారా సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని అద్దంకి నార్త్(శింగరకొండ రోడ్డు) విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టౌన్ ఏఈ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. కాకానిపాలెం, భవానిసెంటర్, మెయిన్‌రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, శింగరకొండ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

బల్లికురవ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనివాసరావు(50) అనే కూలీ మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయన బంధువులు తొలుత చిలకలూరిపేటలోని వైద్యశాలకు, అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం కూలీ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

నాగార్పమ్మ ఆలయానికి గేటు బహూకరణ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలోని నాగార్పమ్మ ఆలయానికి పెరిశెట్ల తులసీ ప్రసాద్, అహల్య దేవి దంపతులు వారి పూర్వీకుల జ్ఞాపకార్థం సుమారు రూ.55 వేల ఖరీదు గల స్టీల్ గేటును బహూకరించారు. దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ తిరునాళ్ల

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పేరాల పోలేరమ్మ 50వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా శనివారం నుంచి మంగళవారం వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లను కమిటీ ప్రతినిధులు ఇప్పటికే పూర్తి చేశారు. శనివారం సాయంత్రం కలశంతో గ్రామోత్సవం, ఆది, సోమవారాలు అమ్మవారికి జల బిందెల కార్యక్రమం, మంగళవారం సిడిమాను ఉత్సవం, చింతామణి నాటిక, హరిశ్చంద్ర కాటి సీను, మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

చీరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మునిసిపల్ పరిధిలోని జేజేపేట, ఉజిలీపేట చర్చిల్లో నిర్వహించిన పవిత్ర ప్రార్థనల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. వేటపాలెం రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు విశేషంగా హాజరయ్యారు. అలాగే వీధుల్లో క్రీస్తు శిలువతో ర్యాలీ నిర్వహించారు.

ఇంకొల్లు : గుడ్‌ఫ్రైడే సందర్భంగా మండలంలోని చర్చిలలో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యత గురించి వివరించారు.అనంతరం ఏసు క్రీస్తు వేషధారణలో శిలువ మోస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కారంచేడు(పర్చూరు): కారంచేడు ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో క్రైస్తవులు శిలువ యాత్ర నిర్వహించారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై మాల్యాద్రి, పోలీసులు

కొమర్నేనివారిపాలెంలో చోరీ

● 15 సవర్ల బంగారం , రూ.10వేల నగదు అపహరణ

కొమర్నేనివారిలెం(పర్చూరు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పర్చూరు మండలం కొమర్నేనివారిపాలెంలో శుక్రవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన యర్ర వెంకటసుబ్బయ్యకు చెందిన నివాసంలో గురువారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న 15 సవర్ల బంగారు అభరణాలు, రూ.10వేలకు పైగా నగదుతోపాటు, రూ.50వేల విలువ చేసే ఎల్ఈడీ టీవీతో పరారయ్యారు. వెంకటసుబ్బయ్యకు ఆరోగ్యం సరిగా లేకపోవటంతో భార్య ఝాన్సీతో కలసి ఆసుపత్రి అందుబాటులో ఉంటుందన్న ఉద్దేశంలో చీరాలలో నివాసం ఉంటున్నారు. అయితే గ్రామంలో ఉంటున్న ఝాన్సీ మేనత్త గురువారం రాత్రి చనిపోవటంతో చీరాల నుంచి కొమర్నేనివారి పాలెం వచ్చారు. శుక్రవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి తలుపులు పగులకొట్టి ఉండటంతో ఒక్కసారిగా ఆందోళనకు గురిఅయ్యారు. భార్యతో కలసి ఇంటిలో చూడగా బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, టీవీ చోరీకి గురిఅయ్యాయని తెలుసుకొని బంధువుల సహాయంలో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్సై మాల్యాద్రి సిబ్బందితో కలసి చోరీ జరిగిన నివాసాన్ని పరిశీలించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులుకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీతోపాటు, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బాపట్ల క్యూస్ టీంకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చిన నమూనాలు సేకరించారు.

స్థల వివాదంపై కేసుల నమోదు

మార్టూరు,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద స్థలం వివాదంపై మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఎస్‌కె నాగూర్, ఎస్‌కె రహమాన్ అనే ఇద్దరు వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఆమేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదా శుక్రవారం తెలిపారు. ఈ నెల 16 వతేదీ రాత్రి ఇంటి దగ్గర పాత కక్షల నేపథ్యంలో నాగూర్,రహమాన్‌లు వారి బంధువులతో కలిసి కర్రలతో దాడి చేసి కొట్టుకున్నారు. ఇరువర్గాలకు గాయాలయ్యాయి. వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అనంతరం వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్టూరు ఎంఆర్‌ఎఫ్ షోరూంలో చోరీ

మార్టూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఎంఆర్‌ఎఫ్ షోరూంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు శుక్రవారం షాపు యజమాని కొల్లా రాము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం వేకువజామున సుమారు 3గంటలు సమయంలో బుల్లెట్‌పై వచ్చిన ఇద్దరు యువకులు షాపునకు ఉన్న షట్టర్ తాళాలను పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. షాపులో ఉన్న సుమారు 50 వేల రూపాయల నగదును తీసుకువెళ్లారు. ఉదయం షాపు తీయడానికి వచ్చిన యజమాని దొంగతనం జరిగిందని భావించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. అనంతరం ఈ విషయంపై స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ

● క్యాబిన్‌లో చిక్కుకుపోయిన డ్రైవర్

● రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు

అద్దంకి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి సిమెంట్ లోడు లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్యాబిన్ నుజ్జునుజ్జుకాగా డ్రైవర్ అందులో చిక్కుకు పోయాడు. బయటకు తీసేందుకు సుమారు 2 గంటల సమయం పట్టింది. పోలీస్‌ల కథనం మేరకు అద్దంకి మండలంలోని చక్రాయపాలెం సమీపంలో భవనాసి చెరువు కట్ట వద్ద నామ్ రోడ్డుపై శుక్రవారం ఉదయం బొగ్గులారీ అద్దంకి వైపు వస్తూ మరమ్మతులకు గురై ఆగి పోయింది. వెనుక నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. దీంతో సిమెంట్ లోడు లారీ క్యాబిన్ పూర్తిగా దెబ్బతింది. సిమెంట్ లోడు లారీ డ్రైవర్ నరేంద్ర క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకొని నరేంద్రను బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి చివరకు ఎక్స్‌కవేటర్ సహాయంతో క్యాబిన్‌ను తొలగించి తీవ్రంగా గాయపడ్డ లారీ డ్రైవర్ నరేంద్రను బయటకు తీసి 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.


నుజ్జునుజ్జయిన సిమెంట్ లోడ్ లారీ ముందు భాగం

పాల వాహనం బోల్తా

పంగులూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు, చందలూరు గ్రామాల మధ్య సురభి డెయిరీ పాలవాహనం అదుపు తప్పి రోడు మార్జిన్‌లో బోల్తా పడింది. మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద గల డెయిరీ నుంచి శుక్రవారం ఉదయం పాలవాహనం పాల పదార్థాలతో చందలూరు వైపుగా చీరాల వెళ్లేందుకు బయలుదేరింది. తూర్పుకొప్పెరపాడు గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న కారుకు దారి ఇచ్చే క్రమంలో రోడ్డు మార్జిన్‌లో పడిపోయింది.ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఎన్.కల్యాణ్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

మేదరమెట్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పమిడిపాడులో యువకుడిపై కత్తితో దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. శుక్రవారం రాత్రి మొద్దు హనుమంతరావు భార్యతో గొడవపడుతుండగా ఆమె సమీప బంధువు అయిన మీసాల గోపి అడ్డు వెళ్లడంతో హనుమంతరావు కత్తితో దాడిచేశాడు. దీంతో గోపి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని ఒంగోలుకు తరలించారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

● 11 ద్విచక్రవాహనాల స్వాధీనం

● ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలో తనిఖీలు

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ అభిషేక్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని తోటవారి పాలెం, ఈపూరుపాలెం, వాడరేవు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో అనుమానితుల వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.